# 4. పల్లెకు పోదాం



“శ్రీ లతా! క్షేమంగా వెళ్లిరా తల్లీ ... అందరినీ అడిగానని చెప్పు. రేపు ఉగాదికి అందరూ ఓసారి వచ్చిపొండి. ఈ ఊళ్లో పండుగ చాలా బాగా చేస్తారు” బస్సు కదలబోతుండగా కిటికీ వద్ద నిలబడి అంటోంది సీతమ్మత్త. ఆమె గొంతులో అంతులేని ఆప్యాయత.

“సరే అత్తా, ఉత్తరం రాస్తాలే” కిటికీలోంచి చూస్తూ చేయి ఊపింది శ్రీలత. తనను సాగనంపడానికి కుటుంబంలోని వారంతా తరలి వచ్చారు. తమ దగ్గరి బంధువుల పిల్లలు కూడా వచ్చారు. ప్రకాశం మామయ్య వచ్చాడు. రమణ, పార్వతి, పద్మ, బుజ్జి, చంటి ... వీళ్లంతా వచ్చారు. వానర సైన్యం ! దారిలో ఎంత అల్లరి చేశారో !

చిరునవ్వులతో వీడ్కోలు చెప్పారు. చేయి ఊపుతున్న తమ నేస్తం కనుమరుగయ్యేంతవరకు అలా చేతులు ఊపుతూనే ఉన్నారు...

బస్సు ఊరి పొలిమేర దాటింది ...

ఆహ్లాదకరమైన గ్రామీణ వాతావరణాన్ని విడిచి వెళ్తుంటే శ్రీలతకు ఏదో పోగొట్టుకున్నట్లుగా ఉంది.

బస్సులో తన కాళ్ల పక్కన సీతమ్మత్త సర్దిపెట్టిన సంచులు ఉన్నాయి. ఒక సంచినిండా వాళ్ల చేలో పండిన కూరగాయలు, మరో సంచి నిండా పండు మిరప కాయలు. సీతమ్మత్తగారి మిరప తోట తన కెంత నచ్చిందో ! చెట్లకు వేళ్లాడుతూ పండు మిరపకాయలు ఎంత అందంగా ఉన్నాయో!

"ఇవన్నీ ఎక్కడ మోసుకు వెళ్లేదే - అత్తా !" అంటే వింటేనా? "నువు మోసేదేముంది కోడలా! బస్సులో కూర్చుంటే గంటలో వెళ్లిపోవూ? ఆ తర్వాత చక్కా రిక్షాలో వెళ్లొచ్చు" అంది.

బస్సు వేగంగా కదలిపోతోంది. శ్రీలత మనస్సులో ఆలోచనలు అంతకన్నా జోరుగా సాగిపోతున్నాయి...

తాను సంక్రాంతి సెలవులు గడపడానికని ఆ ఊరు వచ్చింది. గతంలో ఎప్పుడో ఊహ తెలియక ముందు వచ్చింది. మళ్లీ ఇప్పుడు ! అదీ అమ్మ పోరు పడలేక "సెలవులే కదా. సీతమ్మత్తను ఓసారి వెళ్లి చూసి రారాదూ" అంటూ చెవిలో ఇల్లు కట్టుకు మరీమరీ చెప్పింది. తనకు వెళ్లడం అంతగా ఇష్టం లేదు. ఎందుకంటే సీతమ్మత్త వాళ్లది చిన్న పల్లెటూరు! పైగా పట్నం పిల్లనని తనకు కొంచెం టెక్కు ఉందేమో! అయితేనేం? ఆ టెక్కు కాస్తా ఇప్పుడు ఎగిరిపోయింది.



ఏమాట కామాటే చెప్పుకోవాలి. తనను ఎంత ఆకర్షించిందో ఆ పల్లెటూరి జీవితం! రణగొణ ధ్వనులు లేని ప్రశాంత వాతావరణం, చక్కగా అలికి ముగ్గులు పెట్టిన ఇళ్లు, మనుషుల్లో చక్కటి కలివిడి తనం. ప్రకృతి మాతకు పచ్చని చీర కట్టినట్లు ఊరి చుట్టూ కన్నుల పండుగ చేసే పంట చేలు, చెంగు చెంగున చెంగలించే కోడె దూడలు, కాడి కట్టిన ఎద్దుల మెడల్లో గణగణ మోగే మువ్వల సవ్వళ్లు, కల్లాకపటం లేని కర్షకులు, ఆప్యాయత నిండిన వారి పలకరింపులు .....

... ఆ రోజు బస్సు దిగి చేతిలో చిన్న సూట్‌కేసుతో తాను నడిచి వస్తోంది. దారి పొడవునా ఎవరో ఒకరు తనను పలకరిస్తూనే ఉన్నారు. "ఎవరమ్మాయివమ్మా? ఎవరింటికమ్మా?" అంటూ. తన హృదయం ఎంత పులకరించిందో! వాళ్ల పలకరింపులో అమృతం ఉంది. వెంకటేశు బాబాయ్ అల్లంత దూరం నుండే తనను గుర్తు పట్టాడు. తన చేతిలోని సూట్‌కేసును తీసుకొని "సీతమ్మత్త ఇల్లు గుర్తుందా అమ్మాయీ?. నేను దిగబెడతాను పద ..." అంటూ వెంట వచ్చాడు.

అక్కా, బావా, పెద్దయ్యా అంటూ ఊళ్లో వాళ్లంతా ఎంత చక్కగా వరసలు కలుపుకుంటారు! తమ పట్నంలో అయితే పక్కింట్లో వుండేవాళ్లను కూడా పట్టించుకోరు. ఎవరి బతుకు వాళ్లదే. ఎవరి తొందర వాళ్లదే.



తాను సరిగ్గా పది రోజులు గడిపింది - ఆ పల్లెటూళ్లో. పది రోజులూ పది నిముషాల్లా దొరలిపోయాయి. గుడి ముందు ఆరు బయట వెన్నెల్లో ఆడపిల్లలందరూ కలిసి ఆటలాడుతుంటే ఎంతో సరదాగా ఉంది. బుజ్జిగాడితో కలిసి పంట చేలకు కావలా వెళ్ళడం ఎంత బాగుంటుందో! పొలం గట్టున చింత చెట్టు కింద కూర్చొని, అత్తమ్మ కట్టిన అన్నం మూట విప్పుకొని తింటుంటే - ఎంతైనా తినాలనిపించేది. పచ్చని ప్రకృతి మహిమో? ఏమో!

పొలాలను తడిపే నీటి కాలువలు, ప్రాణవాయువును నింపుకొని హాయిగా వీచే పైరగాలి, వినీల గగనంలో ఎగిరే అందమైన రంగురంగుల పక్షులు ...



పట్నంలో ఇవన్నీ ఎక్కడివి? కార్లూ, మోటార్లూ, సినిమాలూ, హోటళ్లూ, హడావిడీ తప్ప! పట్నంలో తాను ఎప్పుడైనా అందమైన సూర్యోదయం, సూర్యాస్తమయం చూసిందా? రాత్రి సమయంలో వినీలాకాశంలోని నక్షత్రాలు చూసిందా? కొలనులో విరిసిన తామర పూలను చూసిందా?

తమ ఊరు చేరేవరకు ఇవే ఆలోచనలు శ్రీలతకు బస్సు ఆగి కండక్టరు గుర్తు చేసేదాకా తన ఊరు వచ్చినట్లు తెలియనేలేదు !

గంపెడు సంతోషంతో ఇంటికి చేరింది శ్రీలత. "రెండ్రోజుల్లో తిరిగి వస్తావనుకుంటే సెలవులు అయిపోయేదాకా అక్కడే వున్నావేమిటి?" అంది తల్లి.

"రాబుద్ధి కాలేదమ్మా. ఇక నుండి సెలవులు వచ్చినప్పుడల్లా పల్లెటూళ్లోనే గడిపేయాలని ఉంది" అంటూ శ్రీలత నవ్వుతూ తల్లిని వాటేసుకుంది.

## ఇవి చేయండి.

**అ. మీరు ఏదైనా ఊరు వెళ్లివచ్చినప్పుడు, ఆ ఊరిలో మీకు నచ్చిన విషయాలను మీ మిత్రులతో చర్చించండి.**

**ఆ. పర్యాయ పదం అంటే ఒక పదానికి అదే అర్థం వచ్చే మరొక పదం. కింది వాక్యాల్లో గీత గీసిన పదాలకు బదులుగా ఏ పదాలు వాడవచ్చో చెప్పండి. ఆ పదాలతో వాక్యాలు తిరిగి రాయండి.**

ఉదా॥ చెట్టు = వృక్షం, తరువు

1. ఆమె గొంతులో అంతులేని <u>ఆప్యాయత</u>.
2. చేయి ఊపుతున్న తమ <u>నేస్తం</u> కనుమరుగయ్యేంతవరకు అలా చేతులు ఊపుతూనే ఉన్నారు.
3. వినీల <u>గగనం</u>లో ఎగిరే అందమైన రంగురంగుల పక్షులు.
4. <u>కొలను</u>లో విరిసిన తామరపూలను చూసిందా?